క్లుప్తంగా

ఇనుగుర్తి తహసీల్దార్‌గా సూర్యనారాయణ



కేసముద్రం: ఇనుగుర్తి తహసీల్దార్‌గా తోట సూర్యనారాయణ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. తొర్రూరు ఆర్డీఓ కార్యాలయం నుంచి డివిజన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేసిన ఆయన బదిలీపై వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన అబీద్‌అలీ వరంగల్ ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ అయినట్లు అధికారులు తెలిపారు.

సీరోలు తహసీల్దార్‌గా దామోదర్...



కురవి: కురవి తహసీల్దార్‌గా ఉప్పల సునీల్‌కుమార్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు తహసీల్దార్‌గా పనిచేసిన రఫీ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. సునీల్ కుమార్ ఖమ్మం నుంచి బదిలీపై వచ్చారు. సీరోలు మండల తహసీల్దార్‌గా టి.దామోదర్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన ఖమ్మం జిల్లా నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

తొర్రూరు తహసీల్దార్‌గా వినోద్‌కుమార్

తొర్రూరు: తొర్రూరు నూతన తహసీల్దార్‌గా బి. వినోద్‌కుమార్ నియమితులయ్యారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వినోద్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు.

రుణమాఫీపై మాటమార్చిన సీఎం

మరిపెడ: రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేస్తానని చెప్పి సీఎం కేసీఆర్ మాట తప్పారని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. 2018 వరకు రుణాలు తీసుకొని రెన్యువల్ చేసిన వారికి మాత్రమే మాఫీ వర్తింపజేయడం సరికాదన్నారు. 2023 వరకు అర్హులైన రైతులందరికీ వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో తొర్రూర్ డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, నాయకులు యాకయ్య, శ్రీను పాల్గొన్నారు.

ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా నారాయణ



మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా మండలంలోని గడ్డిగూడెం తండాకు చెందిన దారావత్ నారాయణ నియామకం అయ్యారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కురవి: అపరిష్కృతంగా ఉన్న విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు జంజిరాల నాగరాజు అన్నారు. శుక్రవారం కురవి తహసీల్దార్ కార్యాలయం, ఎమ్మార్సీ కేంద్రం వద్ద టీపీయూఎస్ వాల్‌పోస్టర్లను తహసీల్దార్ సునీల్‌కుమార్, డీటీ రఫీ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 21వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద జరగబోయే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుడిబోయిన గోపికృష్ణ, బాలరాజు, లూనావత్ మాంజీ, కందగట్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

గూడూరు: వాతావరణ మార్పులు, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని, ప్రతీ ఒక్కరు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ఆయుష్ వైద్యురాలు రజిత అన్నారు. మండలంలోని అయోధ్యపురం జెడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్‌లో శుక్రవారం ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు, ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు ఆయుష్ శాఖ ముద్రించిన ఆరోగ్య నియమావళి, జాగ్రత్తలకు సంబంధించిన పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హనుమంతరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

గూడూరు: ఆశ్రమంలో పరిశుభ్రత పాటిస్తూ నాణ్యమైన భోజనం వడ్డించాలని తహసీల్దార్ అశోక్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా పరిసర ప్రాంతాలను, వంటశాలను పరిశీలించారు. ప్రతీ ఒక్కటి నాణ్యతగా ఉండాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో చదువుపై శ్రద్ధ చూపాలని, ఎలాంటి ఇబ్బంది కలిగినా హాస్టల్ వార్డెన్‌కు తెలపాలన్నారు.

దరఖాస్తు అందజేత

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ పక్షాన పోటీ చేసేందుకుగాను పార్టీ నియోజకవర్గ నాయకుడు డాక్టర్ భూక్యమురళీనాయక్ శుక్రవారం గాంధీభవన్‌లో మొట్టమొదటి దరఖాస్తు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ భూక్య ఉమా పాల్గొన్నారు.

బహుజన వీరుడు సర్వాయి పాపన్న

బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు శుక్రవారం గౌడ సంఘం నాయకులు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పాపన్న చిత్రపటం, విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ.. రాచరికపు వ్యవస్థ నీడలో జమీందార్లు, జాగీర్దార్ల అరాచకాలకు వ్యతిరేకం కత్తి పట్టిన వీరుడు సర్వాయి పాపన్న అన్నారు. మొగల్ సామ్రాజ్యాన్ని భూస్థాపితం చేసి బహుజన వర్గాల కోసం పోరాటం చేసిన ధీరుడు అని, గోల్కొండను ఏలిన బహుజన చక్రవర్తి అన్నారు. కిలాషాపూర్‌ను బహుజన సామ్రాజ్యముగా ఏర్పాటు చేసుకొని పాలించాడన్నారు. అణగారిన కులాలను ఏకం చేసి చైతన్యపరిచి దొరల పెత్తందారి వ్యవస్థపై తిరుగుబాటు చేసిన మొదటి బహుజన రాజు సర్దార్ పాపన్న గౌడ్ అన్నారు. బలహీన వర్గాలు, యువతకు మార్గదర్శి అని, ఆయన ఆశయాలను కొనసాగించాలన్నారు. - సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ అర్బన్: పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గోపా సంఘం నాయకులు



మహబూబాబాద్ రూరల్: అన్నదానం ప్రారంభిస్తున్న డీఎస్పీ సత్యనారాయణ



నర్సింహులపేట: జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న ఎస్సై సతీష్



కేసముద్రం: కల్వల గ్రామంలో..



నెల్లికుదురు: మండల కేంద్రంలో..



తొర్రూరు రూరల్: వెంకటాపురంలో..



బయ్యారంలో..



గార్లలో..



మరిపెడ: నివాళులర్పిస్తున్న నాయకులు



మహబూబాబాద్ అర్బన్: నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు



చిన్నగూడూరు: నివాళులర్పిస్తున్న గోపా నాయకులు



మహబూబాబాద్ అర్బన్: నివాళులర్పిస్తున్న నాయకులు

వాహనదారుడిపై దాడి

కేసు నమోదు

కేసముద్రం: బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తికిపై ఆటోలో వచ్చిన కొందరు వ్యక్తులు కర్రలతో దాడికి పాల్పడిన సంఘటన మండలంలోని గాంధీపురం జీపీ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మండలం శనిగపురం శివారు బోడతండాకు చెందిన బోడ రమేష్ అనే వ్యక్తి మరోవ్యక్తితో కలిసి బైక్‌పై మహబూబాబాద్ నుంచి కేసముద్రం వైపునకు వస్తున్నారు. ఈ క్రమంలో గాంధీనగర్ జీపీ సమీపంలో మహబూబాబాద్‌కి చెందిన భుక్యా శ్రావణ్ అనే వ్యక్తి, మరికొందరితో కలిసి ఆటోలో వచ్చి బైక్‌ను అడ్డగించి, కర్రలతో బోడ రమేష్‌పై దాడికి పాల్పడ్డారు. ఈమేరకు బాధితుడు ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, హత్యాయత్నం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని హనుమంతునిగడ్డ ప్రాంతానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు చెన్నబోయిన వెంకన్నను ఈనెల 1వ తేదీన బయ్యారం మండలంలోని బాలాజీపేట గ్రామానికి చెందిన కట్ల రాజశేఖర్ అనే ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టగా ప్రమాదంలో గాయపడిన బాధితుడి కుమారుడు చెన్నబోయిన సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ ఎస్సై విజయరాంకుమార్ శుక్రవారం తెలిపారు.

10క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

నెల్లికుదురు: అక్రమ వ్యాపారాలు మానుకోవాలని లేకుంటే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎస్సై క్రాంతికిరణ్ అక్రమ వ్యాపారస్తులను హెచ్చరించారు. శుక్రవారం ఎస్సై మాట్లాడుతూ.. మండలంలోని జామతండా శివారు నిమ్మతండాలో గుగులోతు నరేష్ ఇంట్లో చుట్టు పక్కల తండాల్లో విక్రయించేందుకు అక్రమంగా నల్లబెల్లం నిల్వ చేసినట్లు శుక్రవారం సమాచారం వచ్చిందన్నారు. దీంతో సోదాలు చేయగా 10 క్వింటాళ్ల నల్లబెల్లం, బస్తా పటిక బెల్లం ఉన్నట్లు తెలిపారు. వీటిని స్వాధీనం చేసుకుని గుగులోతు నరేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

అభివృద్ధి, సంక్షేమంతోనే అధికారంలోకి..

- ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

దోర్నకల్: సీఎం కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలతోనే మళ్లీ అధికారంలోకి వస్తామని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పేర్కొన్నారు. మండలంలోని గొల్లచర్ల, హూన్యాతండా, రాముతండా, లచ్చాతండా, కొత్త దుబ్బతండాలలో శుక్రవారం ఎమ్మెల్యే పర్యటించారు. గొల్లచర్లలో డబుల్‌బెడ్రూం ఇళ్లను ప్రారంభించి అర్హులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందించారు. వివిధ గ్రామాలకు చెందిన 19మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. హూన్యాతండా, రాముతండాలలో సిమెంటు రోడ్లను ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటైన సభలలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో అభివృద్ధిపరంగా తెలంగాణ రూపురేఖలు మారాయన్నారు. కార్యక్రమంలో సర్పంచులు చేరెడ్డి సమ్మిరెడ్డి, గుగులోత్ దేవీశంకర్‌నాయక్, బాదావత్ బాలాజి, అజ్మీర లెనిన్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి బిక్షరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నున్నా రమణ, ఎంపీటీసీ సభ్యులు భూక్యా శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, తహసీల్దార్ నాగభవాని, ఎంపీడీఓ అపర్ణ, నాయకులు సత్తిరెడ్డి, రామనాథం, వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బీఆర్‌ఎస్‌లో చేరిక

చిన్నగూడూరు: సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వెంకటేశ్వర్లు, లాలయ్య, బిక్షం, దేవేందర్, వెంకన్న తదితరులు పార్టీలో చేరారు.

ఫ్లెక్సీ తొలగించిన వారిపై చర్య తీసుకోవాలి

బయ్యారం: బయ్యారంలో గుమ్మడి అనురాధ ఫ్లెక్సీని తొలగించిన వారిపై పోలీస్ అధికారులు చర్య తీసుకోవాలని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీసం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. ఇల్లందు నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన నర్సయ్య కుమార్తె అనురాధ రానున్న ఎన్నికల్లో పోటీ చేయాలని ఆమె అభిమానులు పెట్టిన ఫ్లెక్సీని తొలగించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేష్, భిక్షం, జంపయ్య, సమ్మయ్య, శరత్, కిషిందర్ పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్: ప్రభుత్వం స్పందించి సెకండ్ ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్రా శ్రావణ్ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సెకండ్ ఏఎన్ఎంలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేపట్టగా శుక్రవారం మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా నర్రా శ్రావణ్ మాట్లాడుతూ.. సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సెకండ్ ఏఎన్ఎంలు అశ్విని, జ్యోతి, కవిత, సువర్ణ, భద్రమ్మ, సమ్మక్క, సుమలత, పార్వతి, ప్రేమలత, స్నేహలత పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సెకండ్ ఏఎన్ఎంలు

బాలికల భద్రతే షీటీం లక్ష్యం



మాట్లాడుతున్న టౌన్ సీఐ సతీష్

మహబూబాబాద్ అర్బన్: బాలికల, మహిళల భద్రతే షీటీం లక్ష్యమని టౌన్ సీఐ వై.సతీష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం జిల్లా పోలీస్ యంత్రాంగం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ సతీష్ మాట్లాడుతూ.. పాఠశాలలో కానీ, బయట ఎక్కడైన ఆకతాయిలు బాలికలను భయాందోళనలకు గురిచేసినా, వేధించినా, ఇబ్బందికరంగా మాట్లాడిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 100 సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రస్తుతం సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని, సోషల్ మీడియాలో వస్తున్న ప్రతి సమాచారాన్ని నమ్మొద్దన్నారు. ఏదైనా జరిగితే టోల్ ఫ్రీ నంబర్ 1930 ఫోన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం, టౌన్ ఎస్సై దీపికారెడ్డి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రూ.2లక్షల విరాళం అందజేత



కురవి: మండలంలోని తట్టుపల్లి గ్రామంలో రామాలయ నిర్మాణం కోసం కిసాన్ పరివార్ అధినేత నవాత్ భూపాల్‌నాయక్ రూ.2లక్షల విరాళంను చెక్కు రూపంలో శుక్రవారం అందజేశాడు. కార్యక్రమంలో గిరి, బీమానాయక్, సైదులు, అంతిరెడ్డి పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



గార్ల: గార్లలో దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహం ఏర్పాటుకు శుక్రవారం జెడ్పీటీసీ సభ్యురాలు జాటోత్ ఝాన్సీలక్ష్మి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్, సర్పంచ్ అజ్మీర బన్సీలాల్, ఎంపీటీసీ మాలోత్ వెంకట్‌లాల్, గుండా వెంకట్‌రెడ్డి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్ ఎస్సైగా రాజు ఎంపిక



మహబూబాబాద్ రూరల్: సీఆర్పీఎఫ్ ఎస్సైగా జిల్లా కేంద్రంలోని సాలార్ తండాకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు ఆంగోత్ ఉమ్లా రాధ దంపతుల ఏకైక కుమారుడు రాజు ఈనెల 16న ఫలితాలు రాగా, అందులో ఆంగోత్ రాజు ఎంపికయ్యాడు.

ఫీల్డ్ అసిస్టెంట్ల మండల కమిటీ ఎన్నిక

కొత్తగూడ: ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల మండల కమిటీని శుక్రవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దనసరి శ్రీరాములు, ఉపాధ్యక్షుడిగా సంగి సోములు, ప్రధాన కార్యదర్శిగా మద్దెల వెంకన్న, సహాయ కార్యదర్శిగా విజేందర్, కోశాధికారిగా ఉపేందర్, కార్యవర్గ సభ్యులుగా వినయ్‌కుమార్, రాజు, లక్ష్మినారాయణ, సుధాకర్, రవీందర్, రవికుమార్, భాగ్యమ్మ ఎన్నికయ్యారు.

శ్రీమహాగాయత్రి దేవాలయంలో పూజలు

మహబూబాబాద్ రూరల్: శ్రావణమాసం సందర్భంగా జిల్లా కేంద్రంలోని శ్రీమహాగాయత్రి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకులు వంకోజు జలేంద్రాచార్యులు ఆధ్వర్యంలో శుక్రవారం అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చనలు, పుష్పార్చన పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

దోర్నకల్: స్థానిక గాంధీ సెంటర్‌లోని ముత్యాలమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం ఆలయ పంచమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వర పూజతో ప్రారంభమైన వేడుకల్లో గోపూజ, చండీ హోమంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం

మహబూబాబాద్: స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో శుక్రవారం మేరా మిట్టి- మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ అధికారులు స్వాతంత్ర్య సమరయోధులను మున్సిపల్ అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రసన్నరాణి, కౌన్సిలర్లు వెంకన్న, వేణుమాదవ్, డీఈ సీహెచ్ ఉపేందర్, టీపీఓ నవీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీహరి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రైతురాజ్యం

బయ్యారం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే రైతురాజ్యం వస్తుందని పార్టీ నియోజకవర్గ నాయకుడు రవి అన్నారు. గడపగడపకు కాంగ్రెస్‌లో భాగంగా శుక్రవారం మండలంలోని ఇసుకమేధి, మిర్యాలపెంట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరావు, సూర్య, వెంకన్న, పుల్లయ్య, విజయ్, అజయ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

దంతాలపల్లి: మండల స్వయం కృషి మండల సమాఖ్య నూతన కమిటీని ఎన్నుకున్నట్లు డీజీఎం రమేష్, ఏపీఎం సంజీవరావు శుక్రవారం తెలిపారు. అధ్యక్షురాలిగా అంకం లావణ్య, కార్యదర్శిగా రేసు సౌజన్య, ఉపాధ్యక్షురాలిగా మౌనిక, కోశాధికారిగా శైలజ, సహాయ కార్యదర్శిగా శకుంతల ఎన్నికయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మహబూబాబాద్ రూరల్: మండలంలోని పలు గ్రామాల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ రూరల్ ఏఈ భోజ్యానాయక్ శుక్రవారం తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు రంగాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ వేమునూరు ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు కత్తిరించటం, మెయింటెనెన్స్ జరుగుతుందన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

గూడూరు: కొత్తగూడ మండలంలోని గుండాల గ్రామానికి చెందిన ఇరుప పొట్టయ్య అనే వ్యక్తి ఇటీవల కొత్తపల్లిలో జరిగిన పెళ్లికి హాజరై తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. వెంటనే కొత్తగూడ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై నగేష్ సీఈఐఆర్ యాప్ ద్వారా సెల్‌ఫోన్ గుర్తించి శుక్రవారం సీఐ ఫణిదర్ చేతుల మీదుగా అందించాడు.

సన్మానం

గార్ల: గార్లలో శుక్రవారం నుంచి మణుగూరు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదలకు కృషిచేసిన బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఆర్ విమల్‌కుమార్ జైన్‌ను గార్లలో స్థానిక వర్తకులు, వివిధ పార్టీల నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు పుల్లఖండం రమేష్‌బాబు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, కృష్ణచవాన్, రాధాకృష్ణ, శ్రీనివాసరావు, శ్రీనివాస్, ఈశ్వర్‌లింగం, శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు.

కట్టు కాల్వను పూడ్చిన రియల్టర్

- ప్రభుత్వ పాండవుల బోడునుంచి అక్రమంగా మట్టి తరలింపు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- జేసీబీలను పోలీసులకు అప్పగించిన ఓ ప్రజాప్రతినిధి

నెల్లికుదురు: మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామ శివారు శ్రీహరి తండా పరిధిలోంచి గ్రామ ఊర చెరువులోకి వెళ్లే వరద కట్టు కాల్వను ఓ బడా కాంట్రాక్టర్ రియల్ ఎస్టేట్ వ్యాపారి పూడ్చి చదును చేసిన వివరాలు ఇలా ఉన్నాయి. బ్రాహ్మణకొత్తపల్లి గ్రామ శివారు శ్రీహరి తండా పరిధిలో తొర్రూర్‌కు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి సుమారు 5కరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేసినట్లు స్థానికులు తెలిసారు. ఆ వ్యవసాయ భూమిని చదును చేయడానికి గ్రామ పరిధిలోని 445 సర్వేనంబర్ ప్రభుత్వ భూమిలో ఉన్న పాండవుల బోడు నుంచి అక్రమంగా ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వందల ట్రాక్టర్ ట్రిప్పుల మట్టిని తరలించి చదును చేశాడు. అంతే కాకుండా 5ఎకరాల వ్యవసాయ భూమి మధ్యలోంచి వరద నీరు చెరువులోకి వెళ్లడానికి పురాతన కాలం నాటి నుంచి కట్టు కాల్వ ఉండేదని, 12ఫీట్ల వెడల్పు 10 ఫీట్ల లోతుతో రెండు పక్కల వెళ్లేందుకు బాట కోసం కట్ట ఉండేదన్నారు. దానిని సైతం లేకుండా వరదనీరు వెళ్లకుండా పూర్తిగా ధ్వంసం చేసి తను కలుపుకున్నట్లు గ్రామస్తులు, తండా వాసులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయంపై గురువారం (నిన్న) గ్రామస్తులతోపాటు ఓ ప్రజాప్రతినిధి అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న రెండు జేసీబీలను పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ఎస్సై క్రాంతికిరణ్‌ను వివర కోరగా జేసీబీలు తీసుకొచ్చింది వాస్తవమే వాటి మీద ఎవ్వరు ఫిర్యాదు చేయలేదన్నారు.



వ్యాపారి పూడ్చిన కట్టు కాల్వ



అక్రమంగా మట్టి తరలించిన పాండవుల బోడు

నూతన కమిటీ ప్రమాణస్వీకారం

తొర్రూరు: ఫొటోగ్రఫీ గొప్ప కళ అని, ఒక్క ఛాయాచిత్రం వేల భావాలకు నిదర్శనమని ఎస్సై జగదీష్ తెలిపారు. డివిజన్ కేంద్రంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో శుక్రవారం ఫొటోగ్రాఫర్స్, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. మాజీ అధ్యక్షుడు సాదు సుమన్, వర్కింగ్ ప్రెసిడెంట్ దేవరకొండ కృష్ణ ప్రసాద్‌లు నూతన కమిటీకి బాధ్యతలు అప్పగించారు. అధ్యక్షుడిగా మేరుగు కర్ణాకర్, ప్రధాన కార్యదర్శిగా కాసర్ల రవికుమార్, కోశాధికారిగా పస్తం సాయి కిరణ్, గౌరవ అధ్యక్షులుగా మాచర్ల వెంకన్న, ముఖ్య సలహాదారులుగా ఎల్లారెడ్డి, వెంకటాద్రి, సంతోష్, ఉపాధ్యక్షులు వినయ్, పవన్, సహాయ కార్యదర్శులు శంకర్, సిద్దు రామరాజ్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నీలం రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లూరి నాగేంద్రాచారి, నాయకులు పాల్గొన్నారు.